సాక్షి చిత్తూరు
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు

శాసన సభ అంచనాల కమిటీ బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీలో సమావేశం అయ్యారు. - 8లో



సారూ.. ఇసుక తవ్వకాలు ఆపండి

నగరి వద్ద గల కుశస్థలి నదిలో ఇసుక తవ్వకాలు చెక్ పెట్టాలని మండలంలోని తెరణి దళితవాడవాసులు తహసీల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. - 8లో



ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు

పాలేరు సమీపంలో బుధ వారం విద్యార్థులతో వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి : ఎస్పీ



సాంకేతిక విభాగం పనితీరుపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని కమాండ్ కంట్రోల్ విభాగాన్ని ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, డయల్-112 పనితీరు విభాగం, ఫిర్యాదులపై ఎంత సమయంలో స్పందిస్తున్నారనే విషయాలను ఆయన తనిఖీ చేశారు. మహిళలు, పిల్లల సంరక్షణ కోసం వినియోగిస్తున్న 'శక్తి' యాప్‌లో ఫిర్యాదు వస్తే ఎలా స్పందిస్తున్నారు..? నగరంలోని ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసిన కెమెరాల పర్యవేక్షణ..? పై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై ఎప్పటికప్పుడు స్పందించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట కమాండ్ కంట్రోల్ ఎస్ఐ సహదేవి, కమ్యూనికేషన్ ఎస్ఐ భరత్ ఉన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జడ్జీల బదిలీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్‌పిడి.వెన్నెలను గుంటూరు జిల్లా రేపల్లెకు, ఈమె స్థానంలో పీలేరులో పనిచేస్తున్న కె.రవిను చిత్తూరుకు బదిలీ చేశారు. మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లును అనంతపురం జిల్లా హిందూపురానికి , ఈయన స్థానంలో కృష్ణా జిల్లా గన్నవరంలో పనిచేస్తున్న కె.జయలక్ష్మిను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

జలజీవన్ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



ఓవర్‌హెడ్ ట్యాంకు నీటిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కార్వేటినగరం : కార్వేటినగరం మండలంలో జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కార్వేటినగరం దళితవాడలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నీటిని పరిశీలించారు. జల జీవన్ మిషన్ కేంద్ర నిపుణులు అన్స్‌జగన్ మాట్లాడుతూ.. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఈఈ నరేంద్రకుమార్, డీఈ సతీష్ కుమార్, ఏఈ గిరిష్ కుమార్, సర్పంచ్ ధనంజయవర్మ, కార్యదర్శి నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షుక్రియా జగన్ భయ్యా..!

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బిల్లు చట్ట సవరణను అడ్డగోలుగా చేయడంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ముస్లింలకు అండగా నిలిచేందుకు నడుంబిగించారు. ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్‌బిల్లు చట్ట సవరణను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి దిగింది. ముస్లింల అభ్యంతరాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా బీజేపీ ప్రభుత్వం ఏక పక్షంగా సవరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని విన్నవించింది. రాజ్యాంగాన్ని మార్పు చేయడం ముస్లింల హక్కులను కాలరాయడమే నినదించింది. వక్ఫ్ అధీనంలో ఉన్న ఆస్తులు కేంద్రం చేతుల్లోకి వెళ్లేందుకే చట్ట సవరణ చేశారని వైఎస్సార్‌సీపీ ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న వక్ఫ్ ఆస్తులను లెక్కకట్టేందుకే అని చెప్పి ముస్లిం మనోభావాలను కేంద్రం దెబ్బతిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముస్లింలకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జిల్లాలోని ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు.



సుప్రీంకోర్టులో న్యాయపోరాటం పై హర్షం తెలుపుతున్న మైనార్టీలు

- వక్ఫ్‌బిల్లు సవరణపై నిరసన
- సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటంపై హర్షం
- వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

చిత్తూరు కార్పొరేషన్ : వక్ఫ్‌బిల్లు చట్ట సవరణను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో న్యాయ పోరాటానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించడం సంతోషకరమని ముస్లింలు చెబుతున్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి 'షుక్రియ జగన్ భయ్యా' అంటూ నినాదాలు చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద పలువురు ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడారు. మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, నౌషద్, నవాజ్, అల్తాఫ్, చాపు, చామంతి, ఇమ్రాన్, అక్రం, ఖాదర్, షరీఫ్, సాదిక్, జలాలుద్దీన్, హుస్సేన్, అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అణగదొక్కే ప్రయత్నం



బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వచ్చినప్పటి నుంచి ముస్లింలను అణగదొక్కాలని చూస్తోంది. ఎప్పుడు మా విషయంలో వారు వ్యతిరేకంగానే ఉంటున్నారు. అప్పట్లో ఎన్ఆర్‌సీ అంటూ వేధింపులకు గురిచేశారు. దేశంలోని 9.40 లక్షల ఎకరాల వక్ఫ్ భూములను కబ్జా చేయాలని కేంద్రం కుట్ర పన్నింది. టీడీపీ వారికి మద్దతు పలకడం అన్యాయం. – మహ్మద్‌షఫీ, న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు

ఆస్తులపై కన్నేశారు



పూర్వీకులు దానం చేసిన భూములపై కేంద్రం తమ అధీనంలో తీసుకోవాలని చూడటం నేరం. ముస్లింలు అంటే బీజేపీకు నచ్చదు. కానీ వారి ఆస్తులపై కన్నేశారు. వక్ఫ్ బిల్లు సవరణకు టీడీపీ మద్దతు పలకడం ప్రజలను వంచించడమే.. బిల్లుకు టీడీపీ మద్దతు తెలుపకపోతే బాగుంటుందని ఆ పార్టీలోని ముస్లింలు ఆశించారు. – అను, కోఆప్షన్ సభ్యుడు

ముస్లింలకు అండగా వైఎస్సార్‌సీపీ



మొదటి నుంచి మైనార్టీల పక్షపాతిగా వైఎస్సార్‌సీపీ నిలుస్తోంది. జగనన్న మాకు మద్దతుగా సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయడం గొప్ప విషయం. వైఎస్సార్ పాలనలో ముస్లింలకు రిజర్వేషన్ అమలు చేశారు. దాంతో ఎంతో మంది చదువుకొని ఉద్యోగాలు సాధించారు. ఆయన వారసుడిగా జగనన్న నిలుస్తూ అండగా ఉంటున్నారు. – మస్తాన్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడు, మైనార్టీ విభాగం వైఎస్సార్‌సీపీ

రాజ్యాంగ విరుద్ధం



కూటమి పాలనలో ముస్లిం అంటే విలువ లేకుండా పోయింది. వక్ఫ్ బిల్లు సవరణపై సీఎం, డిప్యూటీ సీఎంలు బీజేపీతో వ్యతిరేకించలేదు. మసీదు, దర్గా, మదరాస, సందర్శించాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలా..? అదే విధంగా మరణిస్తే శ్మశానంలో పూడ్చటానికి వారి అంగీకారం కావాలా. వీటిని అందరూ వ్యతిరేకించాలి. – కౌసర్, కల్చరల్ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

ప్రజలకు అండగా నిలబడదాం



నూతన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆర్కే రోజా

నగరి : ప్రజలకు అండగా నిలబడి పార్టీని బలోపేతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యులు ఆర్కే రోజా పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయం వద్ద మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. పార్టీ ఇచ్చిన పదవిని బాధ్యతగా స్వీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీడీ భాస్కర్, మున్సిపల్ పార్టీ ఉపాధ్యక్షుడు మునివేలు, ఏవీ పీఠాంబరం, ప్రధాన కార్యదర్శులు శశికుమార్, తనికాచలం, నూర్ మహ్మద్, కార్యదర్శులు లోకనాథం, మేషాక్, ధనపాల్, చంద్రన్, షణ్ముగం, నాయకులు అయ్యప్ప, ఎల్లప్పరెడ్డి, మురుగ, ఆనంద్‌కుమార్, హమీద్, కన్నాయిరం, చంద్రబాబు, ఉమాపతి పాల్గొన్నారు.

ఈనెల 20 వరకు రేషన్ పంపిణీ పొడిగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఈనెల 20వ తేదీ వరకు రేషన్ పంపిణీని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఇప్పటి వరకు 87 శాతం రేషన్ పంపిణీ జరిగిందన్నారు. మిగిలిన కార్డుదారులు రేషన్ తీసుకోవాలనే ఉద్దేశంతో పంపిణీని ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

స్వర్ణరథంపై వరసిద్ధుడి అభయం

- ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



సంకటహర చతుర్థి వ్రతంలో భక్తులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చతుర్థి సందర్భంగా అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతంను చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతంను ఆచరించారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల్లో ఊరేగింపు

స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి రాత్రి ఆలయ మాడ వీధులలో స్వర్ణ రథంపై విహరించారు. ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారి స్వర్ణ రథంలో కొలువు దీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వర్ణ రథం ఆలయ మాడ వీధులలో అభయమిస్తూ ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



బంగారు రథంలో ఊరేగుతున్న స్వామివారు

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు, మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి ఎంఎస్ భారతి

గంగాధర నెల్లూరు : రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికారి సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి పేర్కొన్నారు. మండలంలోని నాసంపల్లిలో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా గిరిజనుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి భారతి మాట్లాడుతూ.. చట్టం, హక్కుల గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుల, మత, ప్రాంతం, లింగ భేదం లేకుండా అందరూ చట్టం ముందు సమానులేనన్నారు. ముఖ్యంగా, బలహీన వర్గాలకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించిందని తెలిపారు. వాటి గురించి తప్పకుండా తెలుసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం గురించి చాలా మందికి తెలిసి ఉండవచ్చన్నారు. ఈ చట్టం వివక్ష , హింస నుంచి కాపాడుతుందని అన్నారు. ఏదైనా అన్యాయం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే న్యాయస్థానాలు మీకు అండగా నిలబడుతాయని చెప్పారు. ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందని , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని వీటిని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి , మండల స్థాయి అధికారులు, సర్పంచ్ నీలావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు వదలరా..!

తాగి బండి నడిపిన వారి తాట తీస్తున్నారు జిల్లా పోలీసులు.. ఇలా పట్టుబడిన వారిలో ఎక్కువ మంది యువతే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఏడాదిన్నర కాలంలో జరిమానాలు ఏకంగా రూ. కోటి దాటాయంటే ఎంత విచ్చలవిడిగా తిరుగుతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించినా కేసుల సంఖ్య తగ్గడం లేదు. గతంలో కంటే ప్రస్తుతం జరిమానాలు రెట్టింపు చేసినా మందుబాబుల్లో మార్పు రావడం లేదు. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో మార్పు వస్తేగానీ వీటిని కట్టడి చేయడం అంత సులువు కాదు.



- తాగి రోడ్డెక్కితే బాదుడే!
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.కోటి దాటిన జరిమానాలు
- జిల్లాలో ఏడాదిన్నర కాలంలో 1540 మందిపై కేసులు
- పట్టుబడిన వారిలో ఎక్కువ మంది యువతే
- ప్రజల ఆలోచనలు మారితేనే రోడ్డు ప్రమాదాల నివారణ
- మందుబాబులకు చుక్కలు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. పోలీసులు చూపించిన చుక్కల విలువ ప్రస్తుతం రూ.కోటి దాటింది. అవును.. డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మందుబాబులకు న్యాయస్థానం విధించిన జరిమానా రూ.కోటి దాటడం ఓ సరికొత్త రికార్డును సృష్టించింది.



మద్యం తాగి వాహనాలు నడిపే వాళ్లను గుర్తిస్తున్న చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు

సిఫార్సులు పట్టించుకోకుండా

చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు కొన్నాళ్లుగా ఒకటే లక్ష్యంతో పనిచేస్తున్నారు. తాగి రోడ్డుపైన వాహనం నడపకూడదు. పట్టుబడిన వ్యక్తి తమవాడేనని ఎవరు చెప్పినా వినకూడదని గట్టిగా అనుకున్నారు. అనుకున్న లక్ష్యాన్ని రోడ్డుపైనే ఏడాదిన్నరగా అమలు చేశారు. మద్యం తాగి స్కూటర్ నడపడం, కార్లు, లారీలు, ట్రాక్టర్లు ఇలా ఏ వాహనం నడిపినా మందుబాబులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా చెక్ చేయడం.. తాగినట్లు తేలితే వాహనాన్ని అక్కడికక్కడే సీజ్ చేయడం చేస్తున్నారు. ఆపై వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నారు. ఇలా ఏడాదిన్నర కాలంలో ఏకంగా 1540 మందిపై చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసులు నమోదు చేశారు. వీళ్లను న్యాయస్థానంలో హాజరు పరచగా.. తొలుత రూ.2 వేలు ఉన్న జరిమానా ఇటీవల మోటారు వాహన యాక్టును సవరణ చేయడంతో రూ.10 వేలకు చేరింది. ఫలితంగా మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడ్డ వాళ్లకు ఒక్కొక్కరికీ న్యాయస్థానం రూ.10 వేలు చొప్పున జరిమానాలు విధిస్తూ వస్తోంది.

జైలు శిక్షలు కూడా..

ప్రస్తుతం అమల్లో ఉన్న మోటారు వాహన చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే మొదటిసారి కోర్టు రూ.10 వేల జరిమానా విధిస్తోంది. అదే వ్యక్తి రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా.. మూడేళ్ల వరకు జైలు శిక్ష కూడా విధిస్తారు. చిత్తూరులో ఇప్పటి వరకు 1540 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రుజువు కావడం ఏకంగా రూ.1,03,62,000 జరిమానాలు విధించారు. వీళ్లల్లో 32 మందికి ఒక్క రోజు నుంచి మూడు రోజుల వరకు జైలు శిక్షలు కూడా విధించారు. జరిమానాలు, జైలుశిక్షల విషయం పక్కన పెడితే.. రోడ్డు ప్రమాదాలకు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రధానం కారణం. వాహన చోదకుల్లో మార్పు వస్తే తప్ప ఈ తరహా కేసుల నమోదుకు విరామం లభించదు.



మార్పు కోసమే..

మద్యం తాగి వాహనాలు నడిపేవాళ్లను కోర్టు ముందు ఉంచాలని, జరిమానా విధించాలని, జైలుకు పంపించాలన్నది మా లక్ష్యం కాదు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికే ఈ విషయంలో గట్టిగా పనిచేస్తున్నాం. రోజుకు సగటున ఆరు కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడుతున్న వారిలో 22–45 ఏళ్ల మధ్య వాళ్లే ఉక్కువగా ఉంటున్నారు. కొన్నిసార్లు మైనర్లు పట్టుబడుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ విషయంపై దృష్టి సారించాలి. – నిత్యబాబు, సీఐ, చిత్తూరు ట్రాఫిక్



ఫోర్జరీ ముఠా కటకటాలపాలు

- కొలిక్కి వచ్చిన తహసీల్దార్ సంతకం ఫోర్జరీ కేసు
- ఆరుగురు నిందితుల అరెస్టు
- నిందితుల్లో ఇద్దరు రెవెన్యూ సిబ్బంది.. నలుగురు పరారీ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్ : తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్న ముఠా ఎట్టకేలకు కటకటాలపాయ్యింది. చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలుగా చలామణి అవుతున్న పెరుమాల్ మోహన్(45), ఎం.రాజశేఖర్(32), ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న జి.గౌతం(24), కె.జాన్సి(28), డాక్యుమెంట్ రైటర్ కె.గజేంద్ర కుమార్(52) అనే అయిదుగురు నిందితులను బుధవారం తాలూక పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి తహసీల్దార్, తహసీల్దార్ కార్యాలయ రాజముద్రలు, ఓ గ్రీన్ ఇంకు పెన్నును స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా కొందరు నకిలీ అధికారులు పలు రాజముద్రలు కలిగిన సీళ్లను ఉంచుకుని, తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారనే విషయంపై 'సాక్షి' దినపత్రికలో ఈ ఏడాది జనవరి 4వ తేదీన 'ఆగని ఫోర్జరీ దందా' శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. దీంతో అప్పటి తహసీల్దార్ కళావతి తన సంతకాలు ఫోర్జరీ అయ్యాయని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు కేసును ముందుకు వెళ్లనీయకుండా మిన్నకుండిపోయారు. అయితే దీనిపై ఎస్పీ మణికంఠ సీరియస్‌గా తీసుకుని, కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని తాలూక ఎస్ఐ మల్లికార్జునను ఆదేశించారు. అనంతరం కేసు దర్యాప్తు పట్టాలెక్కింది. తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీచేసి, తిమ్మసముద్రం గ్రామంలోని భూమికి ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ పత్రం ద్వారా ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో భారీగా రుణం తీసుకోవాలన్నది నిందితుల పథకం. వచ్చే రుణంలో 20 శాతం తమకు ఇవ్వాలని జాన్సి, గౌతం ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో, ఇవి తప్పుడు ధ్రువీకరణ పత్రంగా సబ్-రిజిస్ట్రార్ గుర్తించారు. అనంతరం కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలుగా చెలామణి అవుతున్న ఇద్దరితో పాటు ఓ డాక్యుమెంట్ రైటర్, ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఇంకా ఈ కేసులో నలుగురు పరారీలో ఉన్నారు. వాళ్లను సైతం త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఆగని ఫోర్జరీ దందా!

సాక్షిలో ప్రచురితమైన కథనం

ఫోర్జరీ కేసులో ఇద్దరు వీఆర్ఏల సస్పెన్షన్

గతంలో పనిచేసిన తహసీల్దార్ కళావతి సంతకం ఫోర్జరీ కేసులో ఇద్దరు వీఆర్ఏలపై కేసు నమోదైందని, వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వారు తండ్రి పేరుతో పనిచేస్తుంటే వాళ్ల తండ్రులను బాధ్యులు చేస్తూ..విధుల నుంచి తొలగిస్తామన్నారు. ఇకపై తండ్రి పేర్లతో పనిచేస్తామంటే కుదరదని, అలా ఆరు నెలల వరకే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి రూ.30 లక్షల నిధులు


సామగుట్టపల్లెలో పర్యటిస్తున్న కడా పీడీ

కుప్పం : కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు సామగుట్టపల్లెలోని పలు సమస్యల పరిష్కారం కోసం కడా పీడీ వికాస్ మరమ్మత్ రూ.30 లక్షలు మంజూరు చేశారు. బుధవారం రెండో వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా యలాజనూరు, చీగలపల్లి, సామగుట్టపల్లి గ్రామస్తులు ప్రధానంగా డ్రైనేజీలు, పైపు లైన్లు ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి గాను వెంటనే రూ.30 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం వేసవి సందర్భంగా తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కంటైనర్‌లో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుప్పం : కుప్పం మీదుగా కోల్‌కతాకు వెళ్తున్న కంటైనర్‌లో బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి ప్రమాదానికి గురైంది. పాల పదార్థాలు తీసుకుని కోల్‌కతా వెళ్తున్న ఏసీ కంటైనర్ పట్టణం బైపాసు రోడ్డు విజలాపురం సర్కిల్ వద్ద అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. అప్పటికే రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. మిగిలిన రూ.10 లక్షల పదార్థాలను మంటల నుంచి కాపాడారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూలో యూజీసీ బృందం పర్యటన

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రాజభాషా సమితి బృందం బుధవారం విస్తృత పర్యటన చేపట్టింది. ఇందులో భాగంగా వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధికారులతో బృందం సభ్యులు డాక్టర్ కిశోర్ కుమార్, వీకే సుదర్శన దేవి సమావేశమయ్యారు. వర్సిటీలో రాజభాషగా ఉన్న హిందీ భాషను కార్యాలయ ఆదేశాలలో ఎంత వరకు అమలు చేస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ వర్సిటీలో రాజభాష హిందీ అమలు తీరు సంతృప్తి కరంగా ఉందన్నారు. హిందీ భాషను వర్సిటీలో మరింత విస్తృతం చేసేందుకు అధికారులు, అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు

- ఒక నియోజకవర్గాన్ని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?
- జెడ్పీలో శాసనసభ అంచనాల కమిటీ సమావేశం
- కూటమి ఎమ్మెల్యేలకు చురకలంటించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ
- పలు శాఖల అధికారులతో సమీక్షించిన కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు



కమిటీ సభ్యుడు కానప్పటికీ సభ్యులతో పాటు స్టేజీ పై కూర్చున్న చిత్తూరు ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు చేయాల్సిన, చేసిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించేందుకు శాసనసభ అంచనాల కమిటీ బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహించారు. సమావేశం నియమ నిబంధనల ప్రకారం సమీక్ష నిర్వహించాల్సి ఉండగా కూటమి ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగా పుంగనూరు నియోజకవర్గంపై అక్కసుతో ప్రసంగించారు. పుంగనూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక సూటిపోటి మాటలు గుప్పించారు. కూటమి ఎమ్మెల్యేల ప్రశ్నలకు కమిటీ సభ్యురాలు ఎమ్మెల్సీ కళ్యాణి దీటుగా సమాధానం ఇచ్చారు. పుంగనూరు నియోజకవర్గంలో ఎందుకు అంత నిధులు ఖర్చు పెట్టారని, మిగిలిన నియోజకవర్గాల్లో ఎన్ని పనులు చేశారని ఆరా తీశారు. ఇందుకు ఎమ్మెల్సీ కళ్యాణి స్పందిస్తూ.. ఇది జిల్లా సమీక్ష అని, ప్రత్యేకంగా ఒక నియోజకవర్గాన్ని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని దీటుగా బదులిచ్చారు. నియోజకవర్గం పరిస్థితులను బట్టి పనులు మంజూరు చేస్తారని, కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు వెంటపడి పనులు చేసుకోవడం సహజమన్నారు. గత పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక ఇలా చేయడం సబబు కాదన్నారు. అలాగైతే గత పది సంవత్సరాల నివేదికలను సిద్ధం చేసి సమీక్ష నిర్వహించాలన్నారు. అలా చేస్తే ఏ ప్రభుత్వం పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుస్తుందని చురకలంటించారు.

శాఖల వారిగా ఖర్చుల వివరాలు సరిగ్గా లేవు..

జిల్లాలో శాఖల వారిగా చేసిన ఖర్చుల వివరాలు సరిగ్గా లేవని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖర్చు చేసిన పనులను విభజించి ఎంత మొత్తం ఖర్చు చేశారో నివేదికలు సిద్ధం చేసి కమిటీకి పంపాలన్నారు. జిల్లాలో శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు


కూటమి ఎమ్మెల్యేలకు చురకలంటిస్తున్న కమిటీ సభ్యురాలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

తాగునీటి పనులకు ప్రాధాన్యం

జిల్లా పరిషత్ నిధులతో తాగునీటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఎక్కువగా మామిడి, టమాట, పూలసాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఏరియా, సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో ప్రస్తుతం కేటాయిస్తున్న నిధులను పెంచాలని చెప్పారు. మిషన్ వాత్సల్య పథకంలో నగదు మొత్తాన్ని పెంచాలన్నారు. సమీక్షలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, శాసనసభ అంచనాల కమిటీ డిప్యూటీ సెక్రటరీ రాజకుమార్, డీఆర్వో మోహన్ కుమార్, జిల్లా అధికారులు సత్యనారాయణ, చంద్ర శేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, వరలక్ష్మి, వెంకటరమణ, శ్రీదేవి, చిన్నారెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎమ్మెల్యే ప్రసంగంపై విమర్శలు

జిల్లాలో శాసనసభ అంచనాల కమిటీ సమావేశం నిర్వహణలో స్టేజీ పై కమిటీ సభ్యులతో పాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కూర్చుని ప్రసంగించడం విమర్శలకు దారితీసింది. శాసనసభ అంచనాల కమిటీలో నిబంధనల ప్రకారం ప్రభుత్వం సభ్యులను నియమించింది. కమిటీలో ఉన్న సభ్యులు మాత్రమే స్టేజీ పై కూర్చుని సమీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. అయితే చిత్తూరు ఎమ్మెల్యే కమిటీ సభ్యుడు కానప్పటికీ స్టేజీ పై కూర్చుని ప్రసంగించడం ఏమిటని పలు శాఖల అధికారులు గుసగుసలాడారు.

సభ్యుల ప్రసంగం ఇలా...

- కమిటీ సభ్యులు పార్థసారథి వాల్మీకి మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నిధులతో కేటాయించిన నిధులలో తాగునీరు, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.
- మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ.. అధికారులు సమీక్షకు సంబంధించి అందజేసే నివేదికలను పూర్తి సమాచారంతో ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి నిధులు కేటాయింపులను విభాగాల వారిగా నివేదికను అందజేయాలన్నారు.
- వివిధ ప్రభుత్వ శాఖల్లో అమలయ్యే పథకాల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన వివరాల నివేదికలను సమర్పించాలని పాసిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాము, కుక్కకాటుకు మందులతో పాటు అవసరమైన ఇతర మందులను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని వరాహ వెంకట సూర్యనారాయణ రాజు కోరారు.
- శాసనసభ అంచనాల కమిటీ సమీక్షలో వివిధ శాఖలకు కేటాయించిన నిధులు ఖర్చు చేసిన అంశాలపై గత పదేళ్ల కాల వ్యవధిలో సమీక్షించేందుకు అవకాశం ఉందని ఎమ్మెల్సీ తెలిపారు. ఫొక్సో కేసుల్లోని బాధితులకు వారి పిల్లల సంరక్షణ అంశాలపై ఐసీడీఎస్ అధికారులు నివేదికలు సమర్పించాలని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పేర్కొన్నారు.

భార్య నగలు తాకట్టు పెట్టి.. జూదమాడిన భర్త

– క్రికెట్ బెట్టింగు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్ : భార్య బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టుపెట్టి జూదం ఆడి రూ. 6 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. చిత్తూరులో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న నలుగురు నిందితులను బుధవారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో చిత్తూరు దొంగలబావి వీధికి చెందిన ఎం.రాజ (26), ఓబనపల్లెకు చెందిన ఇ.దస్తగిరి (33), కె.సర్ఫుద్దీన్ (27), ఎస్.ముని (26) ఉన్నారు. సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చిత్తూరులో పలుచోట్ల ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య, తన సిబ్బందితో కలిసి మంగళవారం సంతపేట ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ నిషేధిత బెట్టింగ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, క్రికెట్ మ్యాచ్‌లపై జూదం కాస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీళ్ల నుంచి రూ.48 వేల నగదు, ఓ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడైన రాజా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మొబైల్‌లో బెట్టింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. చివరకు భార్య బంగారు ఆభరణాలు బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.6 లక్షలను బెట్టింగ్‌లో పోగొట్టుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,543 మంది స్వామివారిని దర్శించుకోగా 21,346 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.22 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

సారూ.. నదిలో ఇసుక తవ్వకాలు ఆపండి


నదిలో బయటపడ్డ రసాయన వ్యర్థాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తెరణి దళితవాడ వాసులు

నగరి : నదిలో ఇసుక తవ్వకాలు ఆపి .. మాపై దయచూపండి అంటూ మండలంలోని తెరణి దళితవాడకు చెందినవారు ఆర్డీఓ కార్యాలయంలో ఏవో, తహసీల్దార్ ధనంజయులుకు వినతిపత్రం అందించారు. కుశస్థలి నదిలో ఇసుక విచ్చలవిడిగా తోడేస్తున్నారని, శ్మశానాన్ని వదలడం లేదని వాపోయారు. పూర్తి స్థాయిలో ఇసుక తోడేయడంతో నదిలో ఇసుక పూర్తిగా అయిపోయి రాళ్లు తేలాయని, డైయింగ్ నీరు నదిలో వదిలేయడంతో అడుగులో పేరుకుపోయిన రసాయన వ్యర్థాలు, ఉప్పు బయటపడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుకాసురులు ఉచిత ఇసుక పేరుతో ఊడేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిదు మండలాలకు చెందిన వందల ట్రాక్టర్లు తెరణి ప్రాంతంలో కుశస్థలి నదిలోనే ఉన్నాయన్నారు. ఇలాగైతే మా మనుగడే ప్రశ్నార్థం అవుతుందని సమస్యను పరిష్కరించాలని అధికారులను దళితవాడ కాలనీ వాసులు కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితా పూర్తికి చర్యలు

- ఒకే యాప్‌లో విద్యాశాఖ కార్యకలాపాలు
- డీఈవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్జేడీ


మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాల విద్యాశాఖ కార్యకలాపాలన్నీ ఒకే యాప్‌లో నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. బుధవారం ఆయన డీఈవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో పలు అంశాలు వెల్లడించారు. రాష్ట్ర విద్యాశాఖ, టీచర్ల కార్యకలాపాలకు లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఏపీ) అనే యాప్ ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ యాప్ బుధవారం నుంచే అందుబాటులోకి వచ్చిందన్నారు. చిత్తూరు జిల్లాలో 8416 మంది టీచర్లు యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోగా మిగిలిన 08 మంది డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉందన్నారు. టీచర్ల సీనియారిటీ జాబితా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాల్లో ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కు 30, స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంకు 38 మొత్తం 68 అభ్యంతరాలు వచ్చాయన్నారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పై తరగతుల ప్రమోషన్‌ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆర్జేడీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో తమ్ముళ్ల తన్నులాట

- టీడీపీ ఇన్‌చార్జి చల్లాకు స్వాగతం పలకడంలో వర్గపోరు
- టీడీపీ వర్గీయుల పరస్పర దాడులు


దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు శివప్పనాయుడు, రామకృష్ణ, మల్లికార్జున నాయుడు

చౌడేపల్లె : తెలుగు తమ్ముళ్లు పరస్పరం కొట్టుకొన్న ఘటన బుధవారం బోయకొండ వద్ద చోటు చేసుకుంది. బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వచ్చే యాత్రికుల కోసం విజయవాడకు చెందిన దాత సామినిరెడ్డి సహకారంతో ఆర్‌ఓఆర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభోత్సవానికి బోయకొండకు వచ్చారు. టీడీపీ కన్వీనర్ శివప్పనాయుడు, రామకృష్ణ, మల్లికార్జుననాయుడు వర్గీయులు, టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బోయకొండ సుబ్బు ఇతర మండల నేతలు కలిసి చల్లాకు స్వాగతం పలికేందుకు ఎవరికి వారు వేర్వేరుగా స్వాగతం పలికి ప్రారంభోత్సవ కార్యక్రమ తంతు ముగించేశారు. కార్యక్రమం పూర్తి అయ్యాక ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తిరుగు ప్రయాణమై వెళ్లిపోయారు. బోయకొండ -మదనపల్లె మార్గంలోని గల శివప్ప నాయుడు అతని అనుచరులతో కలిసి ఇంటికి కారులో కలిసి వెళ్తుండగా ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకొన్నట్లు తెలిసింది. దీంతో టీడీపీలో వర్గపోరు బట్టబయలైంది.

మాకు న్యాయం చేయండి :

టీడీపీ ప్రభుత్వంలోనే మా పార్టీ నేతల నుంచి మాకు ప్రాణహాని ఉంది..మాకు న్యాయం చేయండని టీడీపీ కన్వీనర్ శివప్ప నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. దౌర్జన్యాలను ప్రశ్నించినందుకే పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి ప్రోత్సాహంతోనే బోయకొండ సుబ్బు అతని అనుచరులు, తమపై తమ పార్టీకి చెందిన నాయకులే వచ్చి పక్షిరాజపురం సమీపంలో కారును అడ్డగించి ధ్వంసం చేసి శివప్పనాయుడు, రామకృష్ణ, మల్లికార్జున నాయుడులపై దౌర్జన్యంగా దాడిచేసినట్లు ఆరోపించారు.

ఇస్రో ఆధ్వర్యంలో ఆర్‌ఎల్‌వీ అభివృద్ధి


ఇస్రో అభివృద్ధి చేస్తున్న ఆర్‌ఎల్‌వీ-ఎల్‌ఈఎక్స్-3

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆర్బిటల్ రీ-ఎంట్రీ ఎక్స్‌పరిమెంట్ డిప్లాయిబుల్ లాండింగ్ గేర్(ఆర్‌ఎల్‌వీ)ను అభివృద్ధి చేస్తోంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్, ఐఐఎస్‌యూ డైరెక్టర్ పద్మకుమార్ సమక్షంలోని ల్యాండింగ్ గేర్ డ్రాప్ టెస్ సౌకర్యాన్ని ప్రారంభించారు. విమానం తరహాలో రెక్కలు కలిగిన పునర్వినియోగ లాంచింగ్ వెహికల్ పుష్పక్ కోసం డిప్లాయిబుల్ ల్యాండింగ్ గేర్ సిస్టం పరీక్ష అర్హత కోసం తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్‌ఎస్‌సీ)లో అత్యాధునిక ల్యాండింగ్ గేర్ డ్రాఫ్ట్ టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. అయితే పుష్పక్ వాహనం ఆరోహణ క్రమంలో కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. కొన్ని కక్ష్యల తరువాత పుష్పక్ వాతావరణంలోకి ప్రవేశించి డిప్లాయిబుల్ ల్యాండింగ్ గేర్ సిస్టంను ఉపయోగించి రన్‌వేపై ల్యాండ్ అవుతుంది. ల్యాండింగ్ గేర్ డ్రాప్ సౌకర్యానికి టెలిస్కొపిక్, ఆర్టిక్యులేటెడ్, సెమీ ఆర్టిక్యులేటెడ్ వంటి వివిధ రకాల ల్యాండింగ్ గేర్‌లను పరీక్షించే సామర్థ్యాన్ని కలిగి వుంటుంది. తారు, కాంక్రీట్, పొడి, తడి, మంచుతో నిండిన ఉపరితలాల వంటి విభిన్న రన్‌వేలపై ల్యాండింగ్ చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉండేలా దీన్ని రూపొందిస్తున్నారు. అయితే భవిష్యత్తులో చంద్రుడిపై వ్యోమగాములను పంపి, తిరిగి తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగానే ఈ ప్రయోగాత్మక పరీక్షలను చేస్తున్నామని కూడా ఇస్రో తెలియజేసింది. అధునాతనమై ఆర్‌ఎల్‌వీలు, విమాన సాంకేతికతల అభివృద్ధి అర్హతను వేగవంతం చేసే సామర్థ్యాన్ని ఇస్రో కలిగి వుంది.

వాహనం ఢీకొని జింక మృతి


నలగాంపల్లె వద్ద మృతి చెందిన జింక

బంగారుపాళెం : మండలంలోని నలగాంపల్లె వద్ద బుధవారం రాత్రి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి జాతీయ రహదారిని దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక తీవ్రంగా గాయపడి మృతి చెందింది. స్థానికులు జింక మృతి సమాచారాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కాల్చివేయనున్నట్లు తెలిపారు.

అగస్తీశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1,09,627


హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు సమక్షంలో ఈ లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో హుండీ ఆదాయం రూ.1,09,627 వచ్చిందని ఈవో వెంకటరాయులు తెలిపారు. ఫంగుణి ఉత్సవంలో భాగంగా భక్తులు ఈ కానుకలను సమర్పించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆటో బోల్తా : విద్యార్థులకు గాయాలు

బంగారుపాళెం : మండలంలోని పాలేరు సమీపంలో బుధవారం విద్యార్థులను తరలిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పాలేరు, పాలమాకులపల్లెకు చెందిన పలువురు విద్యార్థులు బంగారుపాళెంలోని ప్రభుత్వ పాఠశాల, తగ్గువారిపల్లెలోని భవిత పాఠశాల, స్థానిక చైతన్య పాఠశాలలో చదువుకుంటున్నారు. మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తరువాత రోజూ వెళ్లే ఆటోలో 10 మంది విద్యార్థులు బంగారుపాళెం నుంచి ఆటోలో కొత్తపల్లె సర్వీసు రోడ్డు మీదుగా స్వగ్రామాలకు బయలుదేరారు.

పాలేరు అండర్ బ్రిడ్జికి కిలో మీటరు దూరంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడగా పాలమాకులపల్లెకు చెందిన ప్రకాష్ కుమారుడు యువతేజ, పాలేరుకు చెందిన జీవన్ కుమార్తె సౌమ్య, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు యువతేజ, సౌమ్య